క్లుప్తంగా

గృహజ్యోతి దరఖాస్తుల సవరణకు అవకాశం


మాట్లాడుతున్న ఏడీఈ అనురాధ

మధిర: గృహజ్యోతి పథకం దరఖాస్తుదారులకు సవరణల కోసం అవకాశం కల్పిస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఎం.అనురాధ అన్నారు. మధిరలోని విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో కొన్ని ఆన్‌లైన్ పొరపాట్లు చేయడంతో ఇప్పటివరకు కొంత మంది లబ్ధి పొందలేదని తెలిపారు. అలాంటి వారు మధిర మున్సిపాలిటీలో, మధిర, ఎర్రుపాలెం మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల్లో సర్వీస్ నంబర్ సరి చేయించుకోవాలని సూచించారు. సర్వీస్ నంబర్‌కు రేషన్‌కార్డుని అనుసంధానించుకునే అవకాశం ఉందని తెలిపారు. అద్దె ఇంట్లో ఉండే వినియోగదారులు మరొక ఇంటికి మారినప్పుడు ఈ సర్వీస్ నంబర్ కనెక్షన్‌తో అనుసంధానం చేసుకొని జీరో బిల్లు పొందవచ్చని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ


కుర్చీలు అందజేస్తున్న శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని మసీద్‌రోడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆదివారం కుర్చీలను వితరణగా అందజేశారు. అంతకుముందు నాయకులు మట్టా దయానంద్ ఆధ్వర్యాన కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం అనాథలు, ఆస్పత్రులలో రోగులకు పండ్లు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తేళ్ల రమేష్, తోట సుజలరాణి, ఎం.శ్రీనివాస్, లింగన్నబోయిన పుల్లారావు, మరీదు ప్రసాద్, ఎండి కమల్‌పాషా, వీరివాడ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మధిరరూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లెందులపాడు గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన బంగారయ్య తన బైక్‌పై మధిర నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లెందులపాడు సమీపంలో కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో ఆయనకు గాయాలుకావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం


గోపిని సన్మానిస్తున్న నాయకులు

చింతకాని: బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమితులైన కొండా గోపిని మండలకేంద్రంలో పార్టీ నాయకులు ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఆలస్యం వీరప్రసాద్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు చెన్నూరి నాగసుధ, మండల నాయకులు ఇమ్మడి సత్యనారాయణ, చెన్నూరి నాగాచారి, కొయిన్ని నర్సింహారావు, కుందం అనంతరెడ్డి, పర్సగాని యల్లయ్య, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి గోపి, హరికృష్ణ, పాల్గొన్నారు.

పీరీల ఊరేగింపు


పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

తల్లాడ: మొహర్రం పండుగ వేడుకల్లో భాగంగా ఆదివారం పీరీలను ఊరేగించారు. పీరీలను ముస్లింలు అలంకరించి డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగించారు. దర్గా ఎదురుగా ఉన్న హోమగుండం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీర్ల ముజావర్ షేక్ ఈసూబ్, కమిటీ సభ్యులు మెహరాజ్, చాంద్ పాషా, బడే మియా, బీరెల్లిబాబు, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

ఒకే భవనం.. రెండు గురుకులాలు..!

అరకొర వసతులతో సతమతం

- సామర్థ్యం సరిపోక ఇక్కట్లు
- భవనం కేటాయించాలని నివేదికలు పంపినా ఫలితం శూన్యం
- సమస్యలతో అవస్థలు పడుతున్న విద్యార్థినులు



రెబ్బవరంలో రెండు ఎంపీజీ గురుకులాలు నిర్వహిస్తున్న భవనం

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ప్రతీ నియోజకవర్గానికి గురుకుల పాఠశాలను మంజూరు చేసి భవన నిర్మాణాల్లో మాత్రం అలసత్వం వహించింది. ప్రతిఫలంగా ఆశించిన స్థాయిలో గురుకుల పాఠశాలలో విద్యార్థులు చేరినప్పటికీ అరకొర వసతులతో సతమతమవుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ గురుకులంలో విద్యాబుద్ధులు నేర్చుకునే విద్యార్థినులు సమస్యలతో దోస్తీ చేస్తూ తమ చదువులను కొనసాగిస్తున్నారు.

– వైరారూరల్

రెండూ అద్దె భవనంలోనే..

వైరా నియోజకవర్గ పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల 2017లో మండలంలోని ముసలిమడుగు గ్రామానికి మంజూరైంది. దాంతో అధికారులు ముసలిమడుగు గ్రామంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి కొన్ని అనివార్య కారణాలతో భవనాన్ని నిర్మించకుండా వదిలేశారు. దీంతో ఆరు నెలల పాటు బీసీ వెల్ఫేర్ కారేపల్లిలో కొనసాగించారు. ఆ తర్వాత మరల వైరా మండలం రెబ్బవరంలో కొన్నేళ్ల కిందట మూతబడిన ప్రైవేట్ పాఠశాల భవనాన్ని అద్దెకు తీసుకుని అందులో నిర్వహిస్తున్నారు. గురుకులంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు ఉన్నప్పటికీ విద్యార్థుల సామర్థ్యానికి సరిపడా భవనం కానందున కేవలం 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు మాత్రమే పాఠశాల నిర్వహణ కొనసాగిస్తూ ఇంటర్మీడియట్ బోధనను మధిరలో నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో గతేడాది వైరా పట్టణ కేంద్రానికి మహాత్మా జ్యోతిబా పూలే వెల్ఫేర్ రెసిడెన్షియల్ మంజూరైంది. వైరాకు మంజూరైన పూలే గురుకులం నిర్వహణకు సైతం సరైన భవనం లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ముసలిమడుగు, వైరా మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ రెండింటిని రెబ్బవరంలో మూతబడిన ప్రైవేటు పాఠశాల భవనంలోనే కొనసాగిస్తున్నారు.

విద్యార్థినులు ఇలా..

ముసలిమడుగు ఎంజీపీ గురుకులంలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు 430 మంది విద్యార్థినులు ఉండగా వైరా ఎంజీపీలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు సుమారు 319 మంది విద్యార్థినులు రెండు గురుకులాల మీద సుమారు 749 మంది విద్యార్థినులు ఉన్నారు. భవన సామర్థ్యం ఒక్క గురుకులానికే సరిపడా ఉందని మరో భవనం కేటాయిస్తే సమస్య పరిష్కారవుతుందని నిర్వాహకులు ఏడాదికి ఒకసారైన ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నా వారు ఏ మాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనాలు వేర్వేరుగా నిర్మించి వసతులు కల్పించాలని గురుకులాల సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

తప్పని తిప్పలు..


భవనంలో సరిపడాలేని మరుగుదొడ్లు

ఇలా ఒకే భవనం రెండు గురుకులాలు నిర్వహిస్తుండటంతో విద్యార్థినులకు తిప్పలు తప్పడం లేదు. 749 మంది విద్యార్థినులకు కూడా 11 మరుగుదొడ్లు, 11 స్నానపు గదులు మాత్రమే ఉన్నాయి. అలాగే పడుకునేందుకు కేవలం 18 మాత్రమే డార్మెంటరీ గదులు ఉండటంతో ఒక్కో గదికి 22 మంది చొప్పున పడుకుంటున్నారు. ముసలిమడుగు ఎంపీజీకు డార్మెంటరీ హాల్‌లో మంచాలు ఉన్నాయి. వైరా ఎంపీజీకు మాత్రం మంచాలు తదితర వస్తువులు మంజూరైనప్పటికీ సరైన భవనం లేనందున వాటిని అర్ధాంతరంగా నిలిపివేశారు. విద్యార్థినులకు పాఠశాలలో తరగతుల నిర్వహణ కూడా తీవ్ర ఇబ్బందికరంగా మారింది. 36 గదులు మాత్రమే ఉండటంతో ఒక్కో గదిలో సుమారు 35 మందికి బోధన సాగిస్తున్నారు. భోజనం చేసేందుకు కేవలం ఒక డైనింగ్ హాల్ మాత్రమే ఉంది. వంట వండే గది కూడా ఒక్కటే ఉండడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. స్కావెంజర్లు కేవలం ముసలిమడుగు ఎంపీజీకు మాత్రమే ఉన్నారు. అలాగే పాఠశాల భవన ఆవరణలో కేవలం ఒక మోటరు ఉండటంతో నీటి వనరులకు ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. పాఠశాల భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విషసర్పాలు వస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


డార్మెంటరీ హాల్..

త్వరలోనే భవనాన్ని చూస్తాం



ముసలిముడుగు, వైరా రెండు ఎంజీపీ గురుకులాలు ఒకే భవనంలో నిర్వహిస్తున్న నేపథ్యాన భవనం సామర్థ్యం సరిపడడం లేదు. సమస్యలను ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి రెండింటిలోని ఏదో ఒక పాఠశాలకు భవనం చూసి ఒక పాఠశాలను వేరే భవనానికి తరలించి సమస్యను పరిష్కరిస్తాం.

– కె. రాధిక, ప్రిన్సిపాల్, ఎంజీపీటీ గురుకులం, ముసలిమడుగు

రెండింటి నిర్వహణతో సమస్య



ఒక పాఠశాలకు సరిపడా భవనంలో రెండు గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్న సమయాన విద్యార్థినుల మౌలిక వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు విద్యార్థినుల సౌకర్యార్థం ఒక పాఠశాలను వేరే ప్రాంతానికి తరలిస్తే సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారవుతుంది.

– గొల్లమందల శ్రీనివాసరావు, టీజీపీపీ, జిల్లా అధ్యక్షుడు

వసతులు కల్పించాలి



పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు, భవనం చుట్టూ ప్రహరీ లేనందున విషసర్పాల బారిన పడే ప్రమాదం ఉంది. విద్యార్థినుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలి.

– అనుమోలు స్వాతి, విద్యార్థిని తల్లి, పమ్మి గ్రామం

వసతులు కల్పించాలి


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామంలోని ఒక ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న ముసలిమడుగు, వైరా మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థినులకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎంపీజీ బీసీ వెల్ఫేర్ గురుకులాన్ని నాయకులు వేర్వేరుగా సందర్శించి పరిశీలించారు. అనంతరం గురుకులంలో నెలకొన్న సమస్యలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యామ్నాయ భవనాన్ని చూసి ఒక గురుకుల పాఠశాలను వేరే చోటికి తరలించాలన్నారు. ఆర్వోఆర్ వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేయించి తాగునీరు అందించడంతో పాటు మెనూ ప్రకారం నాణ్యతమైన భోజనం కల్పించాలని కోరారు. సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, సమస్యను ఎమ్మెల్యే పరిగణలోకి తీసుకోని శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని గురకుల పీఆర్సీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కార్యదర్శి కోట ప్రేమ్, రవికుమార్, అన్వేష్, సాఫీయా, తిరుమల, నితిన్ తదితరులున్నారు.

టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కారేపల్లి: కారేపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గణితం బోధించటకు అవర్లి బేస్డ్ టీచర్ కావాలని ప్రిన్సిపాల్ ఎండి.అక్తర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో గణితం బోధించటకు బీఎస్సీ బీఈడీ లేదా, ఎంఎస్సీ బీఈడీ అర్హత ఉండి, బోధన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ధ్రువపత్రాల జిరాక్స్‌లను ఈ నెల 19 సాయంత్రం 5లోపు సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక పీరియడ్‌కు రూ.182లు చొప్పున నెలకు వంద తరగతులకు మించకుండా వేతనం చెల్లిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి


మాట్లాడుతున్న ప్రతాప్‌సింగ్‌నాయక్

కారేపల్లి: గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న తెలుగు, హిందీ, పీఈటీ ఉపాధ్యాయ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ పండిట్స్, పీఈటీ టీచర్స్ యూనియన్ నాయకులు మాలోతు ప్రతాప్‌సింగ్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉసిరికాయలపల్లి శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో దొడ్డ అంజయ్య అధ్యక్షతన టీబ్ల్యూపీపీటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పండిట్స్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేస్తూ డీఎస్సీ సర్క్యులర్ ఇచ్చిన మాదిరిగానే, గిరిజన సంక్షేమ శాఖలో తెలుగు, పండిట్, పీఈటీ ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేస్తు సర్క్యులర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చిట్టిబాబు, ఉండం నాగేందర్ రావు, రఘునాథ్, కృష్ణ, లీలావతి, కృష్ణవేణి, హైమావతి, నాగమణి, నాగ ప్రత్యూష, రవి, హరి, చందు, లక్‌పతి, బాలకృష్ణ, వీరన్న పాల్గొన్నారు.

సింగరేణి ప్రభావిత గ్రామాల్లో వైద్యశిబిరం


మందులు పంపిణీ చేస్తున్న సింగరేణి ప్రధాన ఆస్పత్రి సీఎంఓ డాక్టర్ సుజాత

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం జేవీఆర్, కిష్టారం ఓసీల్లో పనిచేసే కార్మికులు, ప్రభావిత గ్రామాల ప్రజల కోసం సింగరేణి ఆస్పత్రి సీఎంఓ ఆధ్వర్యాన ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఓసీ ప్రభావిత గ్రామాలైన అంబేద్కర్‌నగర్, కిష్టారం, ఎన్టీఆర్ కాలనీ, చెరుకుపల్లి, రేజర్ల గ్రామాల వాసులు 239 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు కోటిరెడ్డి, డాక్టర్ ఎ.విక్టరీ వందనం, ఎంవీ.నర్సింహారావు, నర్సింహారావు, దేవదాస్, విజయసందీప్, పంచాయతీ కార్యదర్శులు మనోహర్, రవి, దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి


వసతులపై ప్రశ్నిస్తున్న దయానంద్

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వహాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు మంచి వసతులు, నాణ్యమైన ఆహారం అందించాలని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సూచించారు. పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్, ఎస్టీ బాలికల హాస్టళ్లను ఆదివారం ఆయన సందర్శించారు. హాస్టళ్లలో అందుతున్న సదుపాయాలపై విద్యార్థులతో ఆరా తీశారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. ఎస్సీ హాస్టల్ కుక్ కనకారావు రిజిస్టర్‌లో సంతకాలు చేయకుండా నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, ఎండి కమల్‌పాషా, గాదె చెన్నారావు, దోమ ఆనంద్, తోట గణేష్, సారధిరెడ్డి పాల్గొన్నారు.

వరి పొలాల్లో ఇసుక మేటలు..


పాకలగూడెంలో వరి పొలాల్లో మేటలు వేసిన ఇసుక

సత్తుపల్లిరూరల్: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో వరదప్రవాహంతో మండలంలోని పాకలగూడెంలోని వరిపొలాలు కొట్టుకుపోయాయి. వరినాట్లు వేసిన పొలాలలో వరదకు భారీగా పెద్ద పెద్ద రాళ్లు కొట్టుకురావటంతో పాటు ఇసుక మేటలు వేశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు సాగు చేసుకునే అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. ఈ పంటలను రైతులతో కలిసి నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పరిశీలించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

రోడ్డంతా గుంతలమయమే..

- అధ్వానంగా వెంకటాపురం-గట్లగౌరారం రోడ్డు
- వర్షానికి భారీగా నిలుస్తున్న నీరు
- జాడలేని మరమ్మతులు..
- రోడ్డు ఇరువైపులా దట్టంగా పెరిగిన కంపచెట్లు


గుంతలమయంగా మారిన నారాయణపురం - గట్లగౌరవరం రోడ్డు


ప్రమాదకరంగా మారిన లోతైన గుంత

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం నుండి గట్లగౌరవరం బీటీ రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు పొడవునా గుంతలమయంగా మారింది. నారాయణపురం- సత్యనారాయణపురం, గట్లగౌరవరం గ్రామాల మధ్య మోకాలి లోతులో కూడా గోతులున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలెత్తుతున్నారు. అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని భయంతో ప్రయాణిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న గుంతల్లో ప్రయాణించిన పలువురు వాహన చోదకులు గాయాలపాలైన సంఘటనలూ ఉన్నాయి. మరమ్మతులు చేయకపోవడంతో గుంతల్లో వర్షం నీరు నిలిచి మరింతగా దెబ్బతింటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంప కూడా దట్టంగా పెరిగింది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. నిత్యం ఈ రోడ్డులో నాలుగు గ్రామాల ప్రజలు, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం మైలవరం, అనంతారం గ్రామాల ప్రజలు ప్రసిద్ధి చెందిన తెలంగాణా తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి వారి పుణ్యక్షేత్రానికి, వివిధ పనుల నిమిత్తం ఎర్రుపాలెం మండలకేంద్రానికి వెళ్లే వారు ప్రయాణిస్తుంటారు. ఇంతగా గుంతలమయంగా మారినా ప్రభుత్వం ఏమాత్రం మరమ్మతులు చేపట్టడం లేదు. కనీసం కొత్తగా వచ్చిన ప్రభుత్వమైనా తమ గోడును ఆలకించాలని ఆయా ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈరోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బంది పడుతున్నాం..



నారాయణపురం నుండి సత్యనారాయణపురం, గట్లగౌరవరం గ్రామాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు పొడవునా గుంతలున్నాయి. వర్షం కురిస్తే భారీగా నీరు నిలుస్తోంది. బైక్‌పై ఈరోడ్డు గోతుల్లో ప్రయాణమంటే నరకయాతన కలుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు బాగు చేయాలి.

– నాగినేని ఉమామహేశ్వరరావు, బట్టల వ్యాపారి, ఎర్రుపాలెం

నిధులు మంజూరు చేయాలి



అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు మరమ్మతుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా కంప పెరగడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మరిన్ని ప్రమాదాలు జరగకముందే అధికార యంత్రాంగం మేల్కోవాలి. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి.

– ఉయ్యూరు మల్లిక, మాజీ ఉప సర్పంచ్, జమలాపురం

నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపాం

వెంకటాపురం- గట్లగౌరవరం బీటీ రోడ్డు గుంతలమయంగా ఉన్న విషయం వాస్తవమే. ఈ రోడ్డు మరమ్మతులకు గానూ రూ.10 కోట్ల మేరకు నిధుల మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇంకా నిధులు మంజూరు రాలేదు. నిధులు రాగానే టెండర్లు పిలిచి పనులను పూర్తి చేస్తాం.

– రాజేష్, ఏఈ,ఆర్అండ్‌బీ, ఎర్రుపాలెం

వీధులన్నీ మడుగులే..

కారేపల్లి: మండలంలోని వీధులన్ని వరదనీటితో చిన్నపాటి మడుగులను తలపిస్తున్నాయి. ఇంట్లో నుంచి కాలుబయట పెట్టితేచాలు మోకాళ్లలోతు నిలిచిన నీళ్లల్లో నుంచి నడవాల్సిన పరిస్థితి ఉంది. పాతపోస్టాఫీసు రోడ్డు, మసీదు రోడ్డు, బీసీ, బంజార కాలనీల్లో వీధులన్నీ ఇటీవల కురిసిన వానలకు తటాకాలను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా గుంతలు పూడ్చి, రోడ్డుపై నిలిచిన వరద నీరుని బయటికి పంపాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పాతపోస్టాఫీసు రోడ్డులో నిలిచిన వరదనీరు

ఘనంగా బోనాల వేడుకలు


సత్తుపల్లిరూరల్: బేతుపల్లిలో బోనాల సందడి


తల్లాడలో..

సత్తుపల్లిరూరల్: ఆషాఢమాసం సందర్భంగా సత్తుపల్లి మండలం బేతుపల్లిలో ఆదివారం అంకమ్మతల్లి అమ్మవారికి బోనాలు భక్తి శ్రద్ధలతో సమర్పించారు. డప్పువాయిద్యాలు.. మేళతాళాలతో గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనంతో మహిళలంతా ఊరేగింపుగా తరలివచ్చి అంకమ్మతల్లికి నైవేద్యంగా సమర్పించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల లోకేశ్వరరావు, దొడ్డా శ్రీనివాసరావు, బేతిని శ్రీనివాసరావు, చల్లగుళ్ల అజయ్, మహిళలు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని నరసింహారావుపేట గ్రామంలో మొక్కు పోచమ్మ అమ్మవారికి ఆషాడ మాసం బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామం నుంచి మహిళలు ఇంటి వద్దనే వివిధ రకాల పిండి వంటలు తయారు చేసుకొని, పాల పొంగళ్లతో బోణం ఎత్తుకొని మేళతాళాలతో వచ్చి పసుపు, కుంకుమతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.